సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



పుష్పగిరిలో వేడుకగా కల్యాణోత్సవం

పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వాముల కల్యాణోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. - 8లో



మూడు కిలోల గంజాయి స్వాధీనం

గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. - 8లో



జగనన్నపై ప్రజలకు అపార నమ్మకం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు ఉన్న నమ్మకం అపారమైనదని, మాటల్లో చెప్పలేనిదని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

25లోగా పేర్లు నమోదు

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లుగా బీఈడీ లో స్పెషల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు స్కూల్ అసిసెంట్లు(స్పెషల్ ఎడ్యుకేషన్)గా పదోన్నతికి ఈనెల 25వ తేదీలోగా తమ పేర్లను డీఈఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. పదోన్నతి కోసం తగిన ధ్రువీకరణపత్రాలు సమర్పించాలన్నారు. వీటి ఆధారంగా సీనియారిటీ జాబితా తయారు చేసి పదోన్నతులు కల్పించనున్నట్లు డీఈఓ తెలిపారు.

రెండు రోజుల్లో వర్షాలు

కడప అగ్రికల్చర్ : అల్పపీడన ద్రోణి కారణంగా రాబోయే రెండు రోజుల్లో జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. మంగళవారం కొన్నిచోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. బుధవారం జిల్లాలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని తెలిపారు.

రిమ్స్‌కు అదనపు సీట్లు



కేక్ కట్ చేస్తున్న రిమ్స్ ప్రిన్సిపాల్ సురేఖ

కడప అర్బన్ : ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల(రిమ్స్)లో రేడియాలజీ 5, ఎమర్జెన్సీ మెడిసిన్‌కు ఐదు పీజీ సీట్ల చొప్పున మొత్తం 10 సీట్లు రెండు విభాగాలకు మంజూరయ్యాయి. ఈ మేరకు ఉత్తర్వులు వచ్చాయని రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సురేఖ తెలిపారు.రిమ్స్‌లో ఇప్పటికి 10 విభాగాల్లో 64 పీజీ సీట్లు మంజూరయ్యాయి. దీంతో 20 విభాగాల్లో 108 పీజీ వైద్య విద్య సీట్లకు చేరుకుంది. సోమవారం రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల వైద్యులను, సిబ్బందితో కలిసి ప్రిన్సిపాల్ కేక్ కట్ చేశారు.రేడియాలజీ ఇన్‌ఛార్జ్ హెచ్‌ఓడి డాక్టర్ డేవిడ్ చక్రవర్తిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీబాయి, డిప్యూటీడైరెక్టర్ డాక్టర్ శంకర్‌రెడ్డి, రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సత్వరం స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా 'స్పందన'కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన'ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



క్రీడాకారిణులను అభినందిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి తదితరులు

కడప స్పోర్ట్స్ : అనంతపురంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో వైఎస్ఆర్ జిల్లా బాలికల జట్టు రెండోస్థానంలో నిలిచింది. కడపలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)కు చెందిన నలుగురు విద్యార్థినులు భువనశ్రీ, శ్రీవల్లి, నందిని, శ్రీయలు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపికయ్యారు. వీరిని సోమవారం పాఠశాలలో డీఈఓ వై. రాఘవరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్. వెంకటలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

కడప అగ్రికల్చర్ : జిల్లాలో పసుపు కొనుగోలుకు రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా 4122 మంది పసుపు రైతులు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు కేవలం 1711 మంది మాత్రమే పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఈ గడువు ఈనెల 27న ముగుస్తుందన్నారు. మిగిలిన వారు త్వరితగతిన తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

కనుల ఎదుటే కలల సౌధం

- జిల్లాలో ఊపందుకున్న ఇళ్ల నిర్మాణాల ప్రక్రియ
- జగనన్న లే అవుట్లలో చురుగ్గా మౌలిక వసతుల కల్పన





కడప రామాంజనేయపురం లే అవుట్‌లో జగనన్న కాలనీలోని గృహాలు (ఇన్‌సెట్) వైఎస్ఆర్ కాలనీలో అందంగా నిర్మించుకున్న గృహం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగం పెరిగింది. పేదలు తమకు కేటాయించిన స్థలాల్లో గృహ నిర్మాణాలను చేపట్టారు. కొందరు వేగంగా పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో పడిన అవస్థలు తీరడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి తమ కలను నెరవేరుస్తున్నారని కొనియాడుతున్నారు.అవసరమైన నిధులు కేటాయింపులు జరిగేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నారని చెబుతున్నారు.

శరవేగంగా పనులు

ప్రభుత్వ మార్గదర్శకాలతో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద జిల్లా వ్యాప్తంగా 452 జగనన్న లే అవుట్లలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపులు జరిగాయి. వీటిలో 68,547 గృహాలు మంజూరయ్యాయి. ఇందుకుగాను రూ. 421.93 కోట్లు కేటాయింపుంచారు. ఆయా లేఅవుట్లలో ఇప్పటికే 3600 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేశారు. ఆ కాలనీల్లోని తమ సొంతింటిలో నివాసం ఉంటున్నారు. 36,149 గృహాలు పునాదులు, శ్లాబ్ దశల్లో ఉన్నాయి. దశల వారీగా ఇళ్ల నిర్మాణాలు, బిల్లులు లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండడంతో నిర్మాణ పనులు త్వరితగతిన సాగుతున్నాయి.

ఒక ఇంటికి ఇచ్చే రూ. 1.80 లక్షలకు తోడు డీఆర్‌డీఏ ద్వారా డ్వాక్రా సంఘ సభ్యులకు ఇంటి నిర్మాణానికి రూ. 35 వేలు రుణం బ్యాంకుల నుంచి అందేలా చర్యలు చేపట్టారు. దీంతో లబ్ధిదారులు బయటి వ్యక్తుల వద్ద అప్పు చేయకుండా ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు.

మౌలిక వసతుల కల్పనలోనూ..

జిల్లా వ్యాప్తంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమానికి 452 జగనన్న లే అవుట్లను ఏర్పాటు చేశారు. వీటిల్లో విద్యుత్ లైన్లు, రహదారులు, విద్యుత్ మీటర్లు, తాగునీటి వసతుల కల్పన ఏర్పాటు చేశారు. దీంతో లేఅవుట్లు కాలనీలను తలపిస్తూ సుందరంగా రూపొందుతున్నాయి.

జిల్లాలో గృహనిర్మాణాల వివరాలు..

నియోజకవర్గం	లేఔట్లు	గృహాలు	పూర్తయినవి	వివిధదశల్లో ఉన్నవి
బద్వేలు	70	6,095	435	5660
జమ్మలమడుగు	84	5,811	459	5352
కడప	15	20,688	1401	19287
కమలాపురం	47	1,966	198	1768
మైదుకూరు	62	4,039	473	3566
ప్రొద్దుటూరు	31	18,505	59	18446
పులివెందుల	109	10,339	486	9853
రాజంపేట (సిద్దవటం+ఒంటిమిట్ట)	34	1,104	175	929

సొంతింటి కల నెరవేరింది



మాది రామాంజనేయపురం.18 ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్నాం. గతంలో ఎన్నోమార్లు ఇంటి స్థలం కోసం అర్జీ పెట్టినా ఫలితం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్జీ పెట్టాను. స్థలం మంజూరైంది. జగనన్న లే అవుట్లలో ఇళ్లు కట్టుకున్నాను. ప్రస్తుతం ఆ ఇంటిలోనే ఉంటున్నా!

– షేక్ కల్పనాబేగం, రామాంజనేయపురం, కడప

త్వరలోనే గృహ ప్రవేశం చేస్తా



నేను పదేళ్లుగా ఇంటి స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నాను. చివరికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో స్థలం వచ్చింది. అందులో ఇళ్లు కడుతున్నా. పనులు చివరి దశకు చేరాయి. త్వరలోనే గృహ ప్రవేశం చేస్తాం.

– శాంతమ్మ, లబ్ధిదారురాలు, నకాష్, కడప

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి



పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ప్రభుత్వ ప్రాధాన్యత అంశం. లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసేందుకు వారిని ప్రోత్సహిస్తున్నాం. పనులు పూర్తయిన వెంటనే బిల్లులను సైతం మంజూరు చేస్తున్నాం. జిల్లాలో 452 లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాల పూర్తికి కసరత్తు చేస్తున్నాం.

– కృష్ణయ్య, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్, వైఎస్ఆర్ జిల్లా

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : స్పందనకు వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కార నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు పంపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల వినతులను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేపట్టాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్‌ఎల్‌ఏ రీఓపెనింగ్ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లు

అర్హత ఉన్న పేదలందరికీ ఇంటి స్థలం, ఇళ్లు ఉండాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, జిల్లాలో చేపట్టిన జగనన్న హౌసింగ్ కాలనీలో నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. లేఔట్లలో గృహ నిర్మాణాల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, వెనుకబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జేసీ గణేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయరామరాజు

అభివృద్ధిపథంలో గ్రామ పంచాయతీలు

- 27 పంచాయతీలు అవార్డులకు ఎంపిక
- వైఎస్సార్ జిల్లాలో 19, అన్నమయ్య జిల్లాలో 8



జిల్లా స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు స్వీకరిస్తున్న సర్పంచ్

కడప సెవెన్‌రోడ్స్ : సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనలో భాగంగా తొమ్మిది అంశాలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 27 గ్రామ పంచాయతీలు అత్యుత్తమ ప్రతిభను కనబరచాయి. అందులో వైఎస్సార్ జిల్లాలో 19, అన్నమయ్య జిల్లాలో 8 గ్రామ పంచాయతీలు అవార్డులకు ఎంపికయ్యాయి. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కలెక్టర్ విజయరామరాజు సర్పంచులకు ప్రశంసాపత్రాలు అందజేసి శాలువాలతో త్కరించారు. సర్పంచులతోపాటు సచివాలయ కార్యదర్శులు, జిల్లా, మండల పరిషత్‌లలో పనిచేస్తున్న 39 మంది ఉద్యోగులను సత్కరించారు.

ఉత్తమ పంచాయతీలు ఇవే!

పేదరిక నిర్మూలన, జీవనోపాధుల కల్పన కింద చెన్నూరు మండలం బయనపల్లె, సిద్దవటం మండలం జ్యోతి గ్రామపంచాయతీలు ఉత్తమ ప్రతిభ కనబరిచాయి. ఆరోగ్య పంచాయతీ కింద అట్లూరు మండలం కమలకూరు గ్రామం, కమలాపురం మండలం నల్లింగాయపల్లె పంచాయతీ ఎంపికై ంది. బాలల సంక్షేమానికి సంబంధించి వేంపల్లె మండలం నందిపల్లె, పెండ్లిమర్రి మండలం మొయిళ్ల కాల్వ ఉన్నాయి. తాగునీటి సంవృద్ధి కింద గోపవరం మండలం కాల్వపల్లె, సింహాద్రిపురం మండలం బలపనూరు ఎంపికయ్యాయి. పరిశుభ్రత మరియు పచ్చదనం కింద పెండ్లిమర్రి మండలం మొయిళ్ల కాల్వ, ఒంటిమిట్ట మండలం కొండ మాచుపల్లె పంచాయతీలు ఎంపికయ్యాయి. మౌలిక సదుపాయాల స్వయం సమృద్ధి అంశంలో పులివెందుల మండలం ఇ.కొత్తపల్లె, బద్వేలు మండలం పుట్టాయపల్లె పంచాయతీలు ఉన్నాయి. సామాజిక భద్రత అంశంలో సింహాద్రిపురం మండలం లోమడ, పెద్దముడియం మండలం గుండ్లకుంట గ్రామ పంచాయతీలు ఎంపికయ్యాయి. గుడ్ గవర్నెన్స్ కింద ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తి, పెండ్లిమర్రి మండలంమాచునూరు ఎంపికయ్యాయి. ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ కింద వేంపల్లె మండలం రామిరెడ్డిపల్లె, మైలవరం మండలం దొడియం, చక్రాయపేటలను జిల్లా పంచాయత్ పెర్ఫార్మెన్స్ అసెస్‌మెంట్ కమిటీ ఈ పంచాయతీలను ఎంపిక చేసింది.

రాష్ట్ర స్థాయి అవార్డులు

వైఎస్సార్ జిల్లా వీరపునాయునిపల్లె మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ, అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం వీపీఆర్ కండ్రిగ రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికయ్యాయి.

మహాత్ముడి స్ఫూర్తితో సచివాలయ వ్యవస్థ

- సర్పంచులు సీఎంకు మంచి పేరు తేవాలి
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి





మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : పల్లె సీమలే దేశాభివృద్ధికి పట్టుకొమ్మలని చెప్పిన మహాత్మాగాంధీని స్ఫూర్తిగా తీసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చారని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విద్య, ఆరోగ్యం, తాగునీటి కల్పన వంటి ఎన్నో సదుపాయాలను అందరికీ అందుబాటులోకి తెచ్చారన్నారు. నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సేవలను ప్రతి గడపకు అందించాలన్న ఉద్దేశంతో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని తెలిపారు. సర్పంచులు అంకిత భావంతో పనిచేసి ముఖ్యమంత్రికి మంచి పేరు తీసుకు రావాలని కోరారు.

క్షేత్ర స్థాయిలోనే సమస్యల పరిష్కారం : కలెక్టర్

సచివాలయ వ్యవస్థ వల్ల క్షేత్ర స్థాయిలోనే అనేక సమస్యలు పరిష్కారమవుతున్న దృష్ట్యా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి అర్జీదారుల సంఖ్య తగ్గిందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. పంచాయతీ సెక్రటరీలు ప్రతిరోజు అన్ని వీధులు తిరిగి పనులను పర్యవేక్షించాలన్నారు. సర్పంచులు గుడ్డిగా ఉద్యోగులను నమ్మొద్దని, ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు పరిశీలించాలన్నారు. రక్షిత తాగునీరు, పారిశుద్ధ్యం అందరికీ అందుతున్నాయో లేదో చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ వీరన్న, జెడ్పీ డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

కడప ఎడ్యుకేషన్ : వేసవి సెలవుల్లో కళాశాలల యాజమాన్యాలు ఇంటర్ తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ ఆర్ఐవో రమణరాజు హెచ్చరించారు. సోమవారం కడప ఎన్‌జీవో కాలనీలోని నారాయణ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిలో ఉన్న విద్యార్థులను ఇళ్లకు పంపించారు. ఇంటర్ బోర్డు నిబంధనలను పాటించనందుకు కళాశాలపై పెనాల్టీ విధించడంతోపాటు చర్యలు ఎందుకు తీసుకోకూడదో సమాధానం ఇవ్వాలని వారికి నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు తనిఖీ చేయడానికి టాస్క్‌ఫోర్సు బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బోర్డు నిబంధనలను పాటించకపోతే కళాశాలల గుర్తింపును రద్దు చేయనున్నట్లు చెప్పారు.




తరగతి గదిలో సిబ్బందిని హెచ్చరిస్తున్న ఆర్ఐవో రమణరాజు

ఆహ్లాదతీరం.. ఆనందకరం

ఆహ్లాదకర తీరం..పాపికొండలను తలపించే విధంగా వాతవరణం.. కనుచూపు మేర జలసోయగం..రెండు కొండల నడుమ ఒయ్యారాలు ఒలికించే పెన్నానది.. నీటిలో ఎగిరే చేపలు.. దేశ విదేశాల నుంచి వచ్చే విహంగాలు అరుదైన పక్షిజాతుల ఇక్కడి సందడి చేస్తుంటాయి. అదే సోమశిల వెనుకజలాలు. ఈ ప్రాంతాన్ని పర్యాటకపరంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

- ప్రకృతి సోయగాల 'సోమశిల'
- మళ్లీ బ్యాక్‌వాటర్‌లో ఎకోటూరిజంపై దృష్టి
- వనవిహారంతో పర్యాటకం



పెన్నా, చెయ్యేరు నదులు కలిసిన గుండ్లమాడ వద్ద రెండుకొండల మధ్య దృశ్యం



సోమశిల బ్యాక్‌వాటర్ వద్ద పర్యాటకులు

రాజంపేట : వైఎస్సార్, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని అటవీ ప్రాంతాన్ని అనుసంధానం చేస్తూ పెనుశిల అభయారణ్యం ఏర్పాటుచేయాలని పాతికేళ్ల కిందట ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 1997 డిసెంబరు 15 జీవో నంబరు 106ను జారీ చేశారు. కడప డివిజన్ పరిధిలోని ఒంటిమిట్ట, సిద్దవటం రేంజ్ పరిధిలో 43,491,608 హెక్టార్లు , నెల్లూరు జిల్లాలోని 40,443,265 హెక్టార్లను అభయారణ్యంలోకి చేర్చారు. ఇక్కడ ఎన్నో రకాల పక్షులు సందడి చేస్తున్నాయి. అరుదైన వన్యప్రాణులు, జలచరాలకు ఆవాసంగా మారింది.

కోటపాడు నుంచి..

ఒంటిమిట్ట(రాజంపేటనియోజకవర్గం)మండలంలోని కోటపాడు శివారులో సోమశిల వెనుకజలాల్లో ఎకో టూరిజం ఏర్పాటు చేయాలని 2010లో నిర్ణయం తీసుకున్నారు. అదే ఏడాది సెప్టెంబరు 26న ఈ దిశగా అడుగులు పడ్డాయి. తర్వాత రాష్ట్ర విభజన, టీడీపీపాలనలో ఎకో టూరిజం పడకేసింది.ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎకోటూరిజంతో పర్యాటకపరంగా అభివృద్ధి చేయాలని స్థానిక శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి దృష్టి సారించారు.

సోమశిల జలాశయం నిల్వసామర్థ్యం 77.988 టీఎంసీలు. ప్రస్తుతం 52.3 టీఎంసీలు నిల్వ ఉంది. కోటపాడు, కుడమలూరు, బెస్తపల్లె, ఉప్పరపల్లె, మాధవరం, బోయనపల్లె, చిన్నపురెడ్డిపల్లె, కురుగుంటపల్లె, పొన్నాపల్లి, కొండమాచుపల్లె, మదిలేగడ్డ, గుండ్లమాడ, దొంగలసాని, నెమళ్లగొంది, నర్సనాయనిపేట, వాకమాడ, ఒగూరు, వత్రపురాయి, కొత్తూరు తదితర గ్రామాలు సోమశిల అంతర్భాగంలో ఉండిపోయాయి.

బోటుషికారు ఎప్పుడో..

ఒంటిమిట్ట, నందలూరు, మండలాల్లోని బ్యాక్‌వాటర్‌లో బోటుషికారుకు అనుకూలంగా ఉంటుందని పర్యాటకులు భావిస్తున్నారు. ఒంటిమిట్ట రామాలయం ఇప్పుడు రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటకులు, యాత్రికులు ఈ క్షేత్రానికి వస్తుంటారు. అటువంటప్పుడు సోమశిల బ్యాక్‌వాటర్‌లో షికారు చేయడానికి టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.

నిధులు కేటాయింపులిలా..

2020 ఆగస్టు 30న వనవిహారి కోసం రూ.50లక్షలు అనుమతిచ్చారు. 2021 జూలైలో రూ.120 లక్షలతో చేపట్టాలని పరిపాలన ఆమోదం ఇచ్చారు. కోటపాడు శ్రీరామఎత్తిపోతల పంపుహౌస్ సమీపంలో అనువైన స్థలాన్ని ఎంపిక చేశారు. తొలి విడతలో ఆరుపనులను అటవీశాఖ ఉన్నతాధికారులు రూ.42,84,795లతో చేపట్టాలని ఉత్తర్వులిచ్చారు. ఆన్‌లైన్‌లో ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్లను ఆహ్వానించారు. గిట్టుబాటుకాదని పనులు చేయడానికి ఎవరు ముందుకు రాకపోవడం గమనార్హం. మళ్లీ టెండర్లు పిలవాలని అధికారులు నిర్ణయించారు.

నాటుపడవలో ఎమ్మెల్యే పరిశీలన..

కొడమలూరులో జరిగిన జాతర సందర్భంగా అక్కడికి వెళ్లిన ఎమ్మెల్యే సోమశిల వెనుకజాలలను పరిశీలించారు. అక్కడ ఆయనకు అందుబాటులో నాటుపడవ కనిపించింది. ప్రమాదకరమని తెలిసినా ధైర్యంగా బ్యాక్‌వాటర్‌లో పర్యటించారు. ఒంటిమిట్ట రేంజ్‌కి ఇచ్చిన బోటు పనిచేయక మూలనచేరింది. అయిదేళ్లగా మరమ్మత్తులకు నోచుకోని సంగతి తెలిసిందే.

ఎకో టూరిజం అభివృద్ధికి కృషి



సోమశిల బ్యాక్‌వాటర్‌లో బోటుషికారు ఆహ్లాదకరంగా ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో టూరిజం సెంటర్ అభివృద్ధి చేసుకోవాలి. గతంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హయాంలో ఎకో టూరిజం ఏర్పాటుచేశారు.దీనిని పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఒంటిమిట్ట, నందలూరులో కూడా సోమశిల బ్యాక్‌వాటర్ ఉంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి కృషి చేస్తాం

– మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

పోలీసులకు బారికేడ్ల వితరణ



భారతి సిమెంట్స్ వితరణగా ఇచ్చిన బారికేడ్లతో కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి

కడప అర్బన్ : కడప నగరంలోని ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీసుశాఖ వారికి బారికేడ్లు ఉపయోగపడతాయని భావించి 'భారతి సిమెంట్స్'వారు 50 బారికేడ్లను వితరణ ఇవ్వాలని భావించారు. తొలివిడతగా 23 బారికేడ్లను సోమవారం కడప ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి, ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డిలకు భారతి సిమెంట్స్ యాజమాన్యం నుంచి వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో భారతి సిమెంట్స్ రీజనల్ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

పుష్పగిరిలో వేడుకగా కల్యాణోత్సవం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



చెన్నకేశవస్వామి కల్యాణ దృశ్యం



వైద్యనాథుని కల్యాణంలో తాళిని చూపుతున్న పురోహితులు

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ కామాక్షి వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వాముల కల్యాణోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. వైద్యనాథస్వామి, చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవం ఒకే రోజు జరగడం ఇక్కడ విశేషంగా చెప్పవచ్చు. ఉదయం శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై శ్రీ కామాక్షీ వైద్యనాథుల కల్యాణ మహోత్సవాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపత్తూరు అవధానం, నంద్యాల కుటుంబం వారి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

- రాత్రి కొండపై చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలోని మంటపంలో ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవిలతో శ్రీ చెన్నకేశవుని కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం జరిగిన ముత్యాల తలంబ్రాల కార్యక్రమం ప్రత్యేకత సంతరించుకుంది. స్వామి వారి ముత్యాల తలంబ్రాలను పండితులు భక్తులకు ప్రసాదంగా పంచి పెట్టారు. ఈ సందర్భంగా కొండ ప్రాంతమంతా లక్ష్మీ చెన్నకేశవ నామ స్మరణతో మార్మోగింది. అనంతరం ముదిరెడ్డి వెంకట నరేష్‌రెడ్డి, కేతు వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో అన్నదానాన్ని నిర్వహించారు. అనంతరం ఊంజల్ సేవను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఈవో మహేశ్వరరెడ్డి, అర్చకులు సుమంత్ దీక్షితులు, చెంచు సుబ్బయ్య, ఉభయ దారులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు

కాగా ఆదివారం అర్ధరాత్రి తర్వాత శ్రీచెన్నకేశవ స్వామి గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి రెండు గంటల సమయంలో స్వామివారిని కొండపై నుండి పల్లకిలో మోస్తూ బాణా సంచా పేలుస్తూ, గ్రామ మాడ వీధులలో గ్రామోత్సవం న్విహించారు. నదిలో నుండి గ్రామంలోకి వస్తున్న స్వామిని చూడడానికి, పల్లకిని మోయడానికి భక్తులు పోటీలు పడ్డారు. స్వామివారి గరుడ వాహన సేవను చూడటానికి రాత్రంతా పుష్పగిరిలోనే వున్న వేలాది మంది భక్తులు గ్రామోత్సవంలో స్వామి వారిని దర్శించుకుని తరించారు.

నేడు రథోత్సవాలు

బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి రథోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ లక్ష్మీ చెన్నకేశవుల రథోత్సవం జరుగుతుంది.

రైతుల అభివృద్ధికి కృషి చేయాలి

కడప అగ్రికల్చర్ : గ్రామీణ ప్రాంత రైతుల అభివృద్ధికి వ్యవసాయ సిబ్బంది కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు సూచించారు. సోమవారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ప్లాంట్ హెల్త్ డయగ్నసిస్ సెంటర్ కింద ఎంపికైన రైతు భరోసా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. పంటలసాగు, యాజమాన్య పద్ధతులు, ఎరువులు, పురుగుమందుల వాడకంపై అవగాహన కల్పించి రైతుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ విజయలక్ష్మి, కేవీకే కో ఆర్డినేటర్ వీరయ్య, ఏకవాక కేంద్ర కో ఆర్డినేటర్ మురళీకృష్ణ, ఏడీ యాధవి, సైంటిస్టులు, వ్యవసాయ అధికారి మాధవి పాల్గొన్నారు.

30న బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని మామిళ్ళపల్లె గ్రామంలో ఈ నెల 29, 30 తేదీల్లో అంకాళమ్మ తిరుణాల సందర్భంగా రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను 30న నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.50,116 కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రెండవ బహుమతి రూ.30,116 లక్కిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మూడవ బహుమతిని రూ.20,116 చిట్టిబోయిన చిన్న పాలకొండయ్య యాదవ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

కల్లూరు ఎద్దులు ఫస్ట్



బహుమతులను అందజేస్తున్న చెన్నకేశవరెడ్డి, మల్లికార్జునరెడ్డి

వల్లూరు : పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భారతి సిమెంట్ పరిశ్రమ సౌజన్యంతో ఆదివారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో ప్రారంభమైన ఓల్డ్ కేటగిరి బండలాగుడు పోటీలు మంగళవారం తెల్లవారుజాము 2 గంటల వరకు సాగాయి. ప్రొద్దుటూరు మండలం కల్లూరుకు చెందిన శివ కృష్ణ యాదవ్ ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. కమలాపురం మండలం పుత్తా నాగ సుబ్బారెడ్డి ఎద్దులు రెండవ స్థానంలో, ప్రొద్దుటూరు మండలం ఖాదరా బాద్‌కు చెందిన నాగ సుబ్బారెడ్డి ఎద్దులు మూడవ స్థానంలో నిలిచాయి. నంద్యాల టౌన్‌కు చెందిన అనూష రెడ్డి ఎద్దు, తెలంగాణా రాష్ట్రం ఇటిక్యాల మండలానికి చెందిన చక్రవర్తి గౌడ్ ఎద్దు కలిసి నాలుగవ స్థానంలో, చాపాడు మండలం సాయి గణేష్ శర్మ ఎద్దు, ప్రొద్దుటూరు మండలం కల్లూరుకు చెందిన నాగేష్ ఎద్దు కలసి ఐదవ స్థానంలో నిలిచాయి. వేముల మండలం మూలె రామ సుబ్బారెడ్డి ఎద్దులు ఆరవ స్థానంలో, గోపవరం మండలం నెమలయ్య ఎద్దులు ఏడవ స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ. 60 ,116 నరేందర్ రెడ్డి, మహేంద్రారెడ్డి (ఎంఆర్ హోండా ప్రొద్దుటూరు), రెండవ బహుమతి రూ. 50 ,116 తోట ప్రభాకర్ (ఐగ్రో వర్చువల్ ఐటీ సొల్యూషన్స్ ప్రై లిమిటెడ్, హైదరాబాద్), మూడవ బహుమతి రూ. 40 ,116 బలుసా చంద్ర (శ్రీనివాస ప్లైవుడ్ , కడప), నాలుగవ బహుమతి రూ. 30, 116, ఐదవ బహుమతి రూ. 20 ,116 లను భారతి సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్, నల్లింగాయపల్లె, ఆరవ బహుమతి రూ. 12 ,116 గోటూరుకు చెందిన పాన్నోలు శివ కుమార్ రెడ్డి, ఏడవ బహుమతి రూ. 8, 116 సంతకొవ్వూరుకు చెందిన బండి లక్ష్మిరెడ్డి విరాళంగా అందచేశారు. ఇవి కాకుండా పోటీలలో పాల్గొన్న మిగిలిన ఐదు జతల ఎద్దులకు కన్సోలేషన్ బహుమతుల కింద ఒక్కో జతకు రూ. 4 వేల చొప్పున భారతి సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్, నల్లింగాయపల్లె వారు విరాళంగా అందచేశారు. విజేతలకు ఎర్రగుడిపాడు చెన్నకేశవరెడ్డి, కే మల్లికార్జునరెడ్డిల చేతుల మీదుగా నగదు బహుమతులను, ట్రోఫీలను అందచేశారు.

జగనన్నపై ప్రజలకు అపార నమ్మకం

ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు ఉన్న నమ్మకం అపారమైనదని, మాటల్లో చెప్పలేనిదని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష అన్నారు. సోమవారం కడపలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఏప్రిల్ 7వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల్లో జగనన్నే మా భవిష్యత్తు పేరుతో మెగా పీపుల్స్ సర్వే ప్రారంభించామన్నారు. ఏడు లక్షల మంది పార్టీ సైనికులు ప్రతి ఇంటిని సందర్శించారన్నారు. ప్రజలు తమ భవిష్యత్తు కోసం ఎవరిని విశ్వసిస్తున్నారనే అంశంపై ప్రజాభిప్రాయాలను తెలుసుకుని వారి మద్దతు నమోదు చేయడం జరిగిందన్నారు. మధ్యంతర ఫలితాల నివేదికను ప్రస్తుతం వెల్లడిస్తున్నామన్నారు. మెగా సర్వేలో వస్తున్న ఫలితాలు ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తున్నాయన్నారు. మెగా పీపుల్స్ సర్వేలోని తొలి రోజుల్లో కోటి కుటుంబాలు పాల్గొనగా, సీఎం జగనన్న పాలనకు మద్దతుగా 79 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. పీపుల్స్ సర్వేలో భాగంగా కడప నగరంలో 85 వేల కుటుంబాలను సందర్శించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన వాటిని కూడా సందర్శించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. మెగా పీపుల్స్ సర్వేలో వచ్చిన అద్భుత ఫలితాలు, ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందన తెలియజేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. మెగా పీపుల్స్ సర్వేకు క్షేత్ర స్థాయిలో వస్తున్న స్పందన తో ప్రతిపక్షాలు ఉలిక్కి పడుతున్నాయన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, తోటకృష్ణ, షఫీ, సుబ్బారెడ్డి, అజ్మతుల్లా, దత్తసాయి, లక్ష్మినారాయణ, మనోజ్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ

సిద్దవటం : మండలంలోని గంగానగర్ వద్ద కడప–చెన్నై ప్రధాన రహదారిలో ఆదివారం రాత్రి ద్విచక్రవాహనాన్ని వెనుక వైపున లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరానికి చెందిన మాడా గౌతం(11) అనే బాలుడు మృతి చెందాడని సిద్దవటం ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్త మాధవరానికి చెందిన మాడా క్రాంతికిషోర్, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు గౌతం కొత్త మాధవరం లోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. అయితే క్రాంతికిషోర్, చిన్నకుమారుడు మాడా గౌతమ్‌లు ఆదివారం రాత్రి మిట్టపల్లె డాబా వద్దకు భోజనం పార్సిల్ తెచ్చుకునేందుకు ద్విచక్ర వాహనంలో వెళ్లారు. వీరి వాహనం చాముండేశ్వరీపేట దాటుకొని గంగానగర్ వద్దకు వెళ్లగానే వేంపల్లెకు చెందిన లారీ తిరుపతి నుంచి కడపకు వస్తూ వీరి ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రి కొడుకులు కిందపడ్డారు. ఈ ప్రమాదంలో కుమారుడు గౌతమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి క్రాంతి కిషోర్‌కు స్వల్ప గాయాలు కావడంతో వైద్యం కోసం 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మృకుండాశ్రమం సమీపంలో ఆదివారం రాత్రి రైలు కింద పడి యువకుడు మృతి చెందినట్లు సోమవారం రైల్వే ఎస్‌ఐ రారాజు తెలిపారు. రైల్వే ఎస్‌ఐ వివరాల మేరకు.. మండల పరిధిలోని మృకుండాశ్రమానికి చెందిన మురారి కృష్ణయ్య కుమారుడు మురారి సురేష్(26) అనే యువకుడికి ఈ మధ్య కాలంలో వారి తల్లి దండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని, కానీ అందులో ఒక్కటి కూడా కుదరలేదు. దీంతో మనస్తాపానికి గురైన సురేష్ చనిపోవాలనే ఉద్దేశంతో ఆదివారం రాత్రి మృకుండా శ్రామానికి సమీపంలో ఉన్న రైలు పట్టాలపై వస్తున్న గూడ్సు రైలు కింద పడి చనిపోయాడని తెలిపారు. సురేష్ మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించడంతో సమాచారం అందుకున్న తమ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారన్నారు. కేసు నమోదు చేశామన్నారు.

మూడు కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి కేసులో అరెస్టయిన నిందితుల వివరాలను తెలుపుతున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణా కుమార్‌ల పర్యవేక్షణలో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాజాప్రభాకర్, ప్రొద్దుటూరు త్రీటౌన్ సీఐ నారాయణ యాదవ్, ఎస్‌ఐ కృష్ణంరాజు నాయక్‌లు, సిబ్బందితో కలిసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతలపల్లి మండలం, వట్టిబుసులు గ్రామానికి చెందిన మర్రి సిద్దు అలియాస్ రాజు, అనకాపల్లి జిల్లా రోళ్లగుంట మండలం, బుచంపేట గ్రామంకు చెందిన అద్దాడ కామరాజు, అదేగ్రామానికి చెందిన కన్నురు నాగేశ్వరరావులు ఉన్నారు. వారి వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం కడపలోని 'పెన్నార్' కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఈ కేసు వివరాలను తెలియజేశారు. గంజాయి అక్రమ రవాణా ముఠాలో ఏడుగురిని ఇటీవల జిల్లాలోని ప్రొద్దుటూరు త్రీటౌన్ పరిధిలో అరెస్ట్ చేశామన్నారు. ఇదే ముఠాలోని మరో ముగ్గురిని అరెస్ట్ చేశామన్నారు. వీరిలో మర్రి సిద్దు అలియాస్ రాజు అనే ప్రధాన నిందితుడు చింతపల్లి సమీపంలోని ఏజెన్సీలో గంజాయిని సాగుచేసేవాడన్నారు. ఇతనికి సహాయంగా వున్న మరో ఇద్దరిని అరెస్ట్ చేశామన్నారు. పదేపదే గంజాయి నేరాలకు పాల్పడేవారిపై పి.డి యాక్ట్ ప్రయోగిస్తామని ఎస్పీ హెచ్చరించారు. విద్యాసంస్థల వద్ద మహిళా పోలీసులతో నిఘా ఉంచుతామన్నారు. ప్రజలు కూడా సహకరించాలన్నారు. గంజాయి విక్రయాలు, వినియోగించేవారి సమాచారం డయల్ 100 కు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన పోలీసు అధికారులతో పాటు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి, నగదు రివార్డులను అందచేశారు.

హత్యకేసులో ఇద్దరు అరెస్ట్



కేసు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ నాగరాజు

ఎర్రగుంట్ల : ఓ వ్యక్తి హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని సిర్రాజుపల్లి పరిధిలో సపోటా తోటను కౌలుకు తీసుకుని జీవిస్తున్న గొడ్డు మురళి(55) అనే వ్యక్తిని సింగన్నగారి శేఖర్, తలారి అశోక్‌లు హత్య చేశారని జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు తెలిపారు. కేసు వివరాలను సోమవారం యర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌లో ఆయన పట్టణ సీఐ మంజునాథ్ రెడ్డి, ఎస్‌ఐ వెంకట క్రిష్ణయ్యలతో కలసి విలేకరులకు వివరించారు. సిర్రాజుపల్లికి చెందిన మాధవరెడ్డి సపోటా తోటను తాడిపత్రి మండలం వంగనూరుకు చెందిన గొడ్డు మురళి కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. మురళి చిలంకూరులో నివాసం ఉండేవాడు. అయితే 25 రోజులుగా మురళి కనిపించకపోవడంతో ఈ నెల 21వ తేదీన మాధవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మంజునాథ్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఎస్‌ఐ వెంకట క్రిష్ణయ్య కేసు విచారణ నిమిత్తం చిలంకూరులో విచారణ చేయగా నిందితులైన సింగన్నగారి శేఖర్, తలారి అశోక్‌లు వీఆర్‌ఓ మునెయ్య వద్దకు వచ్చి లొంగిపోయారు.

కాగా.. గొడ్డు మురళి సపోటా తోటను కౌలుకు తీసుకున్న క్రమంలో శేఖర్ కుటుంబంతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో శేఖర్ భార్య సుబ్బమ్మతో మురళి చనువుగా ఉండేవాడు. అయితే పది నెలల కిందట నుండి శేఖర్ బంధువు అయిన తలారి అశోక్ కూడా సుబ్బమ్మతో చనువుగా ఉండటం మురళికి తెలిసింది. దీంతో మురళి తరుచూ శేఖర్‌ను, సుబ్బమ్మను తిడుతూ ఉండేవాడు. అవమాన పరుస్తూ ఉండేవాడు. దీంతో ఎలాగైనా మురళిని అడ్డం తొలగించుకోవాలని శేఖర్, అశోక్‌లు పథకం వేశారు. ఈమేరకు మార్చి 26వ తేదీ తెల్లవారుజామున శేఖర్, అశోక్‌లు సిర్రాజుపల్లి సమీపంలో తుమ్మలబావి వద్ద మాటు వేశారు. కొద్ది సేపటికి మురళి చిలంకూరు నుంచి రావడం చూసి వారిద్దరు కట్టెలతో మురళిని బలంగా కొట్టారు. మురళి గొంతుపై కాలుతో నులుమి చంపేశారు. ఆ తర్వాత శవంను డీజిల్‌తో నిప్పుపెట్టి కాల్చి వేశారు. కాగా.. ఈ కేసులో శేఖర్, అశోక్‌లను నిందితులుగా తేల్చి అరెస్టు చేశామని.. వీరితోపాటు సుబ్బమ్మను కూడా అరెస్ట్ చేశామని డీఎస్పీ నాగరాజు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : రూరల్ పరిధిలోని ఖాదర్‌బాద్ గ్రామంలో గోబి సెంటర్ నిర్వాహకుడు జల్ల బాలయ్య (30) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఖాదర్‌బాద్‌లోని రామాలయం వీధికి చెందిన బాలయ్యకు అదే గ్రామానికి చెందిన లక్ష్మీతో వివాహమైంది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల బాలయ్య మద్యానికి బానిసై రోజూ తాగొచ్చి భార్యను కొడుతూ వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలో ఆమె తన పిల్లలను తీసుకొని రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో అతడు మనస్తాపానికి గురై ఇంటి రేకులకు ఉన్న పైపునకు చీరను చుట్టుకొని ఉరేసుకున్నాడు. రూరల్ ఎస్‌ఐ చిరంజీవి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ

బద్వేలు అర్బన్ : వేగంగా వెళుతున్న ఓ లారీ అదుపుతప్పి దుకాణంలోకి దూసుకెళ్లడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా దుకాణం పూర్తిగా ధ్వంసమైంది. సోమవారం ఉదయం బద్వేలు – మైదుకూరు రహదారిలోని చెన్నంపల్లె సమీపంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె ఆదిచెన్నకేశవస్వామి ఆలయం సమీపంలో చెన్నంపల్లె గ్రామానికి చెందిన ఎన్.వెంకటేశ్వర్లు అనే వ్యక్తి గత కొన్నేళ్ళుగా దుకాణం నిర్వహిస్తున్నాడు. అయితే సోమవారం ఉదయం నెల్లూరు నుండి మైదుకూరు వైపు వెళుతున్న ఓ లారీ చెన్నంపల్లె సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి దుకాణంలోకి దూసుకెళ్ళడంతో దుకాణం పూర్తిగా ధ్వంసమైంది. ఇదే సమయంలో చెన్నంపల్లె గ్రామానికే చెందిన బి.అవినాష్ అనే ఓ యువకుడు ఫోన్ మాట్లాడుకుంటూ దుకాణం వద్ద కూర్చొని ఉన్నాడు. లారీ వేగంగా దూసుకెళ్ళడంతో అక్కడే ఉన్న అవినాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన అవినాష్‌ను కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అర్బన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సూపరింటెండెంట్ ప్రభుత్వ సర్వజన వైద్యశాల వారి కార్యాలయము: కడప.

లేఖ సం:12/E1/2023 | తేది: 24.04.2023

పత్రికా ప్రకటన

నియామకపు ప్రకటన నెం.01/2023 ను అనుసరించి ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కడప నందు కాంట్రాక్ట్ మరియు పొరుగు సేవల పద్ధతిలో పనిచేయుటకొరకు వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల Final Merit List మరియు Not Consider List లను www.kadapa.ap.gov.in వెబ్ సైట్ నందు పొందుపరచడమైనది.

సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కడప.

MUNICIPAL CORPORATION KADAPA

'ap' e-procurement Tender Notice

4413,4464,4626,4792,4821,4828,4862,4869,4872, 4875 to 4879,4898,5003,5017, 5018,5019,5038,5050 to 5091/GGMP/15TH FCG/GF/ATO/MCK dt: 24.04.2023

S.No.	Name of the Work	No. of Works	Ecv. Rs. in lakhs
01	General fund	54	240.00
02	15th FCG	02	34.10
03	GGMP	03	33.26
04	Mplads	03	8.41
	TOTAL: -	62	315.77

05	Bid Document Download Start Date	Bid Document Download End Date	Bid Submission Closing Date & Time
06	24.04.23 @ 3.00 P.M	27.04.2023@ 3.00 P.M	27.04.2023 @ 3.30 P.M
07	24.04.23 @ 3.00 P.M	01.05.2023 @3.00 P.M	01.05.2023 @ 3.00 P.M
08	24.04.23 @ 3.00 P.M	09.05.2023 @ 3.00 P.M	09.05.2023@ 3.00 P.M

Further details can be seen at 'e' Procurement market place in www.apeprocurement.gov.in officer inviting bid, Commissioner, Municipal Corporation of Kadapa, A.P.

Commissioner, Municipal Corporation, Kadapa.